క్లుప్తంగా

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

పాల్వంచ: నవభారత్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులు బానోత్ గౌతమ్, రోడా గ్రేస్, నోయల్ ఇటీవల రాష్ట్ర స్థాయి అండర్–14 స్క్వాష్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పూణెలో జరిగిన అండర్ –14 జాతీయ స్థాయి స్క్వాష్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా స్పోర్ట్స్ సెక్రటరీ స్టెల్లా, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీవైఎస్ఓ పరందామరెడ్డి ప్రతిభ చూపిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా అక్షరాభ్యాసం



అక్షరాలు దిద్దిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్ రోడ్ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, తల్లులు, గ్రామపెద్దల సమక్షంలో మండల పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు మోతుకూరి పద్మ , అంగన్‌వాడీ టీచర్ వై.పద్మావతి చిన్నారులకు అక్షరాలు దిద్దించారు. అనంతరం తల్లీబిడ్డల ఆరోగ్యం, సంరక్షణ, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ సురేందర్ నాయక్, ఉపసర్పంచ్ చేతుల భద్రయ్య, కార్యదర్శి పి.శ్వేత, ఆయా లోకేశ్వరి, తల్లులు, గర్భిణులు ఉష, విజయ, కావ్య, కవిత, దివ్య, రేణుక, సుమలత, కళ్యాణి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్ రోడ్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జాతీయ బాలికల దినోత్సవం, జాతీయ ఓటర్ల దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని పాఠశాలలో స్థానిక మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం నాడు బహుమతులు అందజేయనున్నట్లు హెచ్‌ఎం మోతుకూరి పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ సురేందర్ నాయక్, ఉపసర్పంచ్ చేతుల భద్రయ్య. కార్యదర్శి పి.శ్వేత, అంగన్‌వాడీ టీచర్ వై.పద్మావతి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదవ్వాలి

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతీఒక్కరు ఓటర్లుగా నమోదయ్యేలా బీఎల్‌ఓలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. తహసీల్‌లో బుధవారం బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పోలింగ్ కేంద్రాలలో తీసుకున్న దరఖాస్తులను, ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్ఐలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బస్ డిపో తనిఖీ

ఇల్లెందు: ఇల్లెందు బస్ డిపోను డిప్యూటీ ఆర్ఎం పవిత్ర బుధవారం తనిఖీ చేశారు. బస్ స్టేషన్, ఫ్యాన్లు, మంచినీరు, హోటళ్లు, షాపింగ్‌లు, పబ్లిక్ టాయిలెట్లు, బస్ వేళలు, ప్రయాణికులకు రవాణా సదుపాయం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మేడారం జాతర ప్రారంభం కానున్న సందర్భంగా అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమె వెంట స్థానిక డిపో మేనేజర్ సంజీవరాణి తదితరులు ఉన్నారు.

8న వైస్ ఎంపీపీపై అవిశ్వాసం

ఇల్లెందురూరల్: మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దాస్యం ప్రమోద్‌కుమార్‌పై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసంపై ఫిబ్రవరి 8వ తేదీన ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ శిరీష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం ద్వారా ఎంపీటీసీలకు బుధవారం నోటీసులను అందజేశారు. ఫిబ్రవరి 8న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు నోటీసులలో పేర్కొన్నారు. మండల పరిషత్‌లో ప్రస్తుతం 15 మంది ఎంపీటీసీలు ఉండగా అవిశ్వాసాన్ని బలపరుస్తూ తొమ్మిది మంది ఎంపీటీసీలు ఆర్డీఓను కలిశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీటీసీలుగా తొమ్మిది మంది, బీఆర్ఎస్ నలుగురు, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా నుంచి ఒక్కో ఎంపీటీసీ ఉన్నారు.

అధ్వానంగా అంబేడ్కర్ సెంటర్

- గుంతలు పడి దెబ్బతిన్న రోడ్డు
- ట్రాఫిక్ సిగ్నళ్లు లేక వాహనదారులు తికమక
- పట్టించుకోని అధికారులు



పాల్వంచలోని అంబేడ్కర్ కూడలిలో దెబ్బతిన్న రోడ్డు

పాల్వంచ: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ అధ్వానంగా తయారైంది. భద్రాచలం రహదారిలో కిన్నెరసాని ప్రాజెక్ట్ రోడ్డును కలిపే ఈ జంక్షన్ పట్టణం నడిబొడ్డున ఉంది. పాల్వంచ నుంచి ఎటువైపు వాహనాలు వెళాలన్నా ఈ కూడలి మీదుగా వెళ్లాల్సిందే. ఈ కూడలిలో రోడ్డు మొత్తం దెబ్బతింది. నిత్యం ఈ సెంటర్ నుంచి పెద్దపెద్ద వాహనాల నుంచి బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. పెద్దపెద్ద గుంతలు పడి రోడ్డు దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. ప్రతీ వాహనం ఇక్కడకు రాగానే కుదుపునకు గురవుతున్నాయి. దీంతో ఈ సెంటర్‌లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

ట్రాఫిక్ సిగ్నళ్లు లేక గజిబిజి..

కొత్తగూడెం మీదుగా భద్రాచలం వైపు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక కేటీపీఎస్, కిన్నెరసాని ప్రాజెక్టుకు వెళ్లే మలుపు కూడా ఇదే. ఇక్కడికి రాగానే ఒక్కసారిగా వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. మూడు వైపులా రోడ్ల నుంచి వచ్చేవారు మలుపు తిరిగే క్రమంలో సరైన ట్రాఫిక్ సిగ్నల్స్ లేక గందరగోళం నెలకొంటోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు.

గతంలో అంబేడ్కర్ విగ్రహం రోడ్డు మధ్యలో ఉండేది. వాహనాలు ఈ విగ్రహం చుట్టూ తిరిగి వెళుతుండేవి. ఇప్పుడు రోడ్డు విస్తరణలో భాగంగా అంబేడ్కర్ విగ్రహాన్ని పక్కకు జరిపి ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ కూడలి విశాలంగా మారి వాహనాలన్నీ ఒక దగ్గరకు చేరడంతో ట్రాఫిక్ నిలిచి సమస్య తీవ్రంగా మారింది.

పట్టించుకోని అధికారులు...

అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్డు దెబ్బతిని వచ్చిపోయే వాహనాలతో రోజురోజుకు గుంతలు పెద్దగా అవుతున్నాయి. దీంతో వాహనదారు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండా నిత్యం జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా సమస్యను పట్టించుకోవడం లేదు. గతంలో పాల్వంచ సీఐ వినయ్ కుమార్ చొరవ తీసుకుని గుంతలు పూడ్చి వేయించారు. కానీ కొద్ది నెలలకే మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. వీటిపై పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి



అంబేడ్కర్ సెంటర్‌లో రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై భారీస్థాయిలో గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి ఇక్కడ సమస్య ఉన్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

– పగిళ్ల శ్రీనివాస్, స్థానికులు

అధికారులు స్పందించాలి



మూడు ప్రధాన రోడ్లకు జంక్షన్‌గా ఉన్న అంబేడ్కర్ సెంటర్ అధ్వానంగా మారింది. ఇంతగా రోడ్డు దెబ్బతిన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ సిగ్నల్స్ లేక వాహనదారులు తికమక పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జి.వెంకటేశ్వరరావు, పాత పాల్వంచ

విద్యార్థుల రక్తనమూనాల సేకరణ



రక్తనమూనాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

జూలూరుపాడు: విద్యార్థుల రక్త నమూనాలను ఆర్‌బీఎస్‌కే వైద్యుల ఆధ్వర్యంలో సేకరించారు. పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎనిమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమాన్ని ఆర్‌బీఎస్‌కే డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ నజరీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 8 – 10వ తరగతి విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి పరీక్షించారు. వైద్యులు మాట్లాడుతూ... రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీరా సాహెబ్, పీహెచ్‌సీ సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్ట్ దేవి, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, పార్వతి, ఆశా కార్యకర్త నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేకే ఓసీలో డైరెక్టర్ పర్యటన



ఓసీలో పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం పర్యటించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులపై జీఎంతో చర్చించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని కోరారు. జీఎం జాన్ ఆనంద్, ఎస్ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, మేనేజర్ పూర్ణచందర్, ప్రాజెక్టు ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, సర్వే అధికారి నాగేశ్వరరావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి ఉన్నారు.

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనున్న భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామములను నమోదు చేయించుకోవాలని కోరారు. హోమంలో మగవారు తెల్లపంచె, కండువా.. మహిళలు చీరలు ధరించాలని వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పెండింగ్ నిధులు విడుదల చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

జూలూరుపాడు: తమ పదవీ కాలాన్ని పెంచి, పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరుతూ మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ప్రియాంక అలను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బోడా శాంతిరామ్ మాట్లాడుతూ.. తమ పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనున్నదని, అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని, నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుగులోత్ రాందాస్, బానోత్ నరసింహారావు, భూక్యా రాములు, భూక్యా పద్మ, బానోత్ పద్మ తదితరులు ఉన్నారు.

విచారణ జరిపించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉమెన్స్, డిగ్రీ కళాశాలలో అడ్డగోలుగా ఉద్యోగాల భర్తీ చేస్తున్నారని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివకుమార్ మంగళవారం ఫిర్యాదు చేశారు. మాట్లాడుతూ.. ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకుండా అక్రమ పద్ధతుల్లో బంధువులకు, స్నేహితులకు ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా వార్డెన్, అకౌంటెంట్‌లలో బంధుప్రీతి వలన అవినీతి జరిగే అవకాశం ఉందని విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేసును ఉపసంహరించుకోవాలి

జూలూరుపాడు: ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్‌పై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో సంఘ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. డీఎంహెచ్‌ఓ శిరీష అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంత హక్కులను కాలరాస్తున్న డీఎంహెచ్‌ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో శివ నాయక్, కిరణ్, ధర్మరాజుల రామారావు, సురేష్ నాయక్, దేవ్‌సింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చట్టాలను తెలుసుకోవాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తిచంద్రికారెడ్డి



సింగరేణి(కొత్తగూడెం): రామవరం నేతాజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవం

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఇల్లెందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. మండలంలోని సుభాష్‌నగర్ గిరిజన గురుకుల కళాశాలలో బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నతంగా ఎదగాలన్నారు. ఉచిత నిర్బంధ విద్యను సద్వినియోగం చేసుకోవాలని, బాల్యవివాహాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యను అభ్యసించే చోట ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ప్రయాణం చేసేటప్పుడు అపరిచిత వ్యక్తుల వల్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి కీర్తికార్తీక్, కోశాధికారి కాంపెల్లి ఉమామహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరంలోని నేతాజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనీనా, 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ హాజరయ్యారు. మాట్లాడుతూ.. అన్నిరంగాలలో బాలికలే పైచేయిగా ఉంటున్నారని, తల్లితండ్రులు ఆడ, మగ తేడా లేకుండా సమానంగా పెంచాలన్నారు. నేడు మహిళలు అన్నిరంగాలలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులపై అనేక చట్టాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకుని మహిళలు చైతన్యవంతం కావాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలిక సంరక్షణ హక్కులు, ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం , సామాజిక ఎదుగుదల అంశాలపై శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ద్రౌపది, జహీదా, సీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ కీలకం



గౌరవ వందనం స్వీకరిస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణిలో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి క్రమశిక్షణ కీలకమని జీఎం జాన్‌ఆనంద్ అన్నారు. బుధవారం ఇల్లెందులోని 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో సింగరేణి సెక్యూరిటీ విభాగం మొబిలైజేషన్ పరేడ్‌ను పరిశీలించారు. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొననున్న సెక్యూరిటీ విభాగం ప్రదర్శించే పరేడ్‌లో క్రమశిక్షణ ఉండాలని పేర్కొన్నారు. జీఎం వెంట డీజీఎం జీవీ మోహన్‌రావు, ఏరియా సివిల్ అధికారి రవికుమార్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్స్ అక్బర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

మేడారం బస్ సర్వీస్ ప్రారంభం



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: వచ్చే నెలలో జరగనున్న మేడారం జాతర సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం కొత్తగూడెం నుంచి మేడారానికి బస్ సర్వీసును ఆర్టీసీ డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడారం జాతరకు దాదాపు నెల రోజుల ముందు నుంచే జిల్లా నుంచి భక్తులు తరలివెళ్తున్నారని, చాలామంది భక్తులు బస్సులు అడుగుతున్నారని, ఈ మేరకు ముందుగా ఒక సర్వీస్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కొత్తగూడెంలో ఈ బస్సు ఉదయం 6:30 గంటలకు బయలుదేరుతుందని, తిరిగి మధ్యాహ్నం మేడారంలో 2 గంటలకు కొత్తగూడేనికి బయలుదేరుతుందన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ బస్సులో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అనిత, శామ్యూల్, వైఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, పోలీసులు

టేకులపల్లి: మైనర్లకు బైక్‌లు, కార్లు ఇతర వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లు చేసిన తప్పుకి తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి హెచ్చరించారు. ఈమేరకు బుధవారం ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో టేకులపల్లి పోలీసులు మండల కేంద్రంలో ముమ్మరంగా వివిధ రకాల వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరైనా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేసినా, ప్రమాదాలకు కారకులైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి, ఏఎస్‌ఐ, పీసీలు పాల్గొన్నారు.

జరిమానా...

పాల్వంచరూరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన నలుగురు ద్విచక్ర వాహనదారులకు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ జరిమానా విధించారు. మండలంలోని జగన్నాథపురం బీసీఎం జాతీయ రహదారిపై బుధవారం ఎస్‌ఐ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో బైక్‌లకు నంబర్ ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా నడుపుతున్న వాహనాదారులను పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధలు ఉల్లంఘించి రహదారులపై వాహనాలను నడవద్దని హెచ్చరించారు.

కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న రమేష్

పాల్వంచరూరల్: మతోన్మాద బీజేపీని గద్దె దింపేవరకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ కోరారు. స్థానిక మంచికంటి భవన్‌లో బుధవారం సీఐటీయూ విస్తృతస్థాయి సమావేశం మొగిలి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల కష్టాలకు, కన్నీళ్లకు అసమానతలకు కారణమైన బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. బీజేపీ పాలనలో అన్నిరంగాల కార్మికులు, ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదన్నారు. వచ్చే నెల 16న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ కె.సత్య, సభ్యులు గుర్రం రాములు, రమ్య అచ్చమ్మ, కృష్ణకుమారి, లక్ష్మి, యశోద, స్వరూప, రమేష్, రాంబాబు, సమ్మయ్య పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియా ఉత్తమ కార్మికులు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): గణతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఉత్తమ అధికారులు, కార్మికులను ఎంపిక చేశారు. ఈ మేరకు వివరాలను అధికారులు బుధవారం వెల్లడించారు. ఉత్తమ అధికారిగా డీవైఎస్ఈ (ఈఅండ్ఎం) చిట్టూరి శ్రీనివాస్, కార్మిక విభాగం ఫోర్‌మెన్ కోలాహలం నర్సింహారాజు ఎంపికయ్యారు. పీవీకే–5 ఇంక్‌లైన్‌కు చెందిన గురిజాల శ్రీనివాసరావు, కమ్మచిచ్చు రాజేశ్వరరావు, జేవీఆర్ ఓసీకి చెందిన గిద్దలూరు నాగేశ్వరరావు, పామర్తి రమేష్, కిష్టారం ఓసీకి చెందిన ఉల్లంగి మనోహర్, అల్లదుర్గం కృష్ణ ఎంపికయ్యారని అధికారులు తెలిపారు.

న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు భేష్



గార్డెన్‌ను పరిశీలిస్తున్న మరియన్న

ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ఉద్యాన శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి జినుగు మరియన్న అన్నారు. మండలంలోని మొండితోగు గ్రామపంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ నిర్వాహకులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన న్యూట్రీ గార్డెన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పరిసరాలల్లోని ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ కూరగాయల మొక్కలు పెంచడం చిన్నారులకు మేలు చేస్తుందన్నారు. ప్రతీరోజు నాణ్యమైన కూరగాయలతో చిన్నారులకు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని అందించే వెసులుబాటు కులుగుతుందన్నారు.

ఎప్పుడూ ఇలాగే కొనసాగించి ఇతర అంగన్‌వాడీ కేంద్రాలకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మెజెస్, సెర్ప్ సీసీ రాంబాబు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచరూరల్: డీఎంహెచ్‌ఓ అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుశనాయక్ అన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ఎల్‌హెచ్‌పీఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో హక్కులను కాలరాస్తున్న డీఎంహెచ్‌ఓపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్‌పై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దశరథ్, నందునాయక్, శ్రీనివాస నాయక్, సత్యానారాయణ, నెహ్రూ, వెంకన్న నాయక్ పాల్గొన్నారు.

సీలింగ్ భూములు పరిశీలన



రైతులతో భూముల వద్దకు వెళ్తున్న తహసీల్దార్ రవికుమార్

ఇల్లెందురూరల్: నాలుగు దశాబ్దాలుగా మామిడిగుండాల గ్రామంలోని సర్వే నంబర్ 130లోని సీలింగ్ భూములు వివాదాస్పదంగా ఉన్నాయి. ఈ మేరకు సమస్యను పరిష్కరించేందుకు హైకోర్టు ఆదేశంతో రెవెన్యూ అధికారులు బుధవారం కసరత్తు ప్రారంభించారు. ఎంజాయ్‌మెంట్ సర్వేకు రైతులతో తహసీల్దార్ రవికుమార్ చర్చించారు. ఇదిలా ఉండగా గతంలో సర్వే నంబర్ 130లో మొత్తం 4,209.06 ఎకరాల భూమిలో 2,800 ఎకరాలు స్థానిక గిరిజన రైతులకు సీలింగ్ పట్టాలు పంపిణీ చేశారు. నాడు ఆ ప్రాంతం చెట్ల పొదలతో ఉండటంతో రైతులకు పంపిణీ చేసిన భూములకు సరిహద్దులు నిర్ణయించలేదు. దీంతో రైతులంతా ఎవరికి అనుకూలంగా ఉన్న ప్రదేశంలో వారు సాగు చేసుకున్నారు. ఈ క్రమంలో వివాదం ఏర్పడింది. ఇది నాలుగు దశాబ్దాలుగా కొనసాగడంతో రెండేళ్ల క్రితం రైతుల ఒప్పందం మేరకు రెవెన్యూ అధికారులు సమగ్రంగా అధ్యయనం చేశారు. అప్పటి జాయింట్ కలెక్టర్, ఏడీ సర్వే పర్యవేక్షణలో అప్పటి తహసీల్దార్ ఎనిమిది మంది సర్వేయర్లతో సర్వే చేయించారు. 55.02 ఎకరాల్లో గ్రామాలు, 720 ఎకరాల విస్తీర్ణంలో గుట్టలు, 784 ఎకరాల్లో సాగు చేయని భూమి, 160 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు, కాలువలు ఉన్నట్లు సర్వేయర్లు ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు. అయితే రైతులు ఈ సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆదేశం మేరకు మరోసారి సర్వే నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మామిడిగుండాల, ధనియాలపాడు సర్పంచ్‌లు కుంజ కృష్ణ, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.